క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పుత్తూరు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నూతన పురపాలక సంఘ కార్యాలయంలో చైర్మన్ ఎ.హరి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈఓ

నగరి : మండలంలోని ఎం.కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని ఎంఈఓ నమశ్శివాయం మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రిజిస్టర్స్ అప్‌డేట్‌గా లేవని, రోజువారీ లెక్కలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని స్పష్టం చేశారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. భోజనం తినే విద్యార్థుల సంఖ్యను పెంచాలని ప్రధానోపాధ్యాయిని గీతా కుమారికి సూచించారు.

అంబలి, పిండివంటలు సమర్పణ

శ్రీరంగరాజపురం : మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లెలోని శ్రీఆరిమాని గంగమ్మకు మంగళవారం ప్రత్యేకంగా పూజలు, అభిషేకం నిర్వహించారు. బెంగళూరు నుంచి భక్తులు ప్రత్యేక బస్సులో వచ్చి అంబలి, పిండివంటలు, నైవేద్యం సమర్పించారు. మొక్కులు చెల్లించారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు : వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మంగళవారం సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏప్రాంతమైనా ఏరంగంలోనైనా అభివృద్ధి చెందాలంటే ముందుగా రోడ్డు ఉండాలని తెలిపారు. రోడ్ల అభివృద్ధిలో భాగంగా ఎస్బీఆర్‌పురం పంచాయతీ నిదులు రూ.10 లక్షలతో పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ మణిరాజు, టీడీపీ నాయకులు ధనంజయులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ

కార్వేటినగరం: స్థానిక ఆర్కే ఎస్సార్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్టూడెంట్ కిట్ల (విద్యా కిట్లు)ను ఎమ్మెల్యే థామస్ పంపిణీ చేశారు. ఇక్కడ చదివిన వారు ఎందరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, తాను కూడా ఇదే హైస్కూల్లో చదివినవాడినే కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ప్లస్1, ప్లస్ 2 విద్యార్థులకు భోజన వసతి కల్పించరూ!

అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలో ప్లస్–1, ప్లస్–2 విద్యార్థులకు భోజన వసతి కల్పించాలని ఎంఈఓ విజయకుమార్ ఎమ్మెల్యేను కోరారు. అలాగే ఉపాధ్యాయ సంఘ నాయకులు కిరణ్, గురుమూర్తి, రాబర్ట్, హేమచంద్రారెడ్డి, దొరబాబు టీచర్ల సమస్యలను నివేదించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పొన్న యుగంధర్, మండల పార్టీ అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, బీసీ సంఘం అధ్యక్షుడు రవియాదవ్, పాఠశాల హెచ్ఎం కోటేశ్వరరావు, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం గాయత్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై ఒత్తిళ్లు దారుణం



రవి



ఏసుపాదం

విజయపురం : మధ్యాహ్నం భోజనం వర్కర్స్‌పై రాజకీయ ఒత్తిళ్లు దారుణమని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోదండయ్య మండిపడ్డారు. మంగళవారం విజయపురంలో ఏఐటీయూసీ మండల నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. కోదండయ్య మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీసం వేతనంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నవారిని అర్ధాంతరంగా తొలగించడం సరికాదని తెలిపారు. అనంతరం చేపట్టిన కమిటీ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా రవి, కార్యదర్శిగా ఏసుపాదం, గౌరవ అధ్యక్షులుగా సుజాత, సభ్యులుగా పరిమళ, లక్ష్మి, భువన, షీబా, మునిలక్ష్మి ఎలుమలై, సుధాకర్‌ను ఎన్నుకున్నారు.

అమ్మపాలే అమృతం

అమ్మ అనే పదంలోనే ఆప్యాయత..అనురాగం.. మురిపెం మిళితమై ఉంటుంది. తల్లిపాలతోనే బిడ్డకు తొలి టీకా అందుతుంది. శారీరక ఎదుగుదలకు దోహద పడుతుంది. నవజాత శిశువుకు బలం చేకూరుస్తుంది. అయితే కొందరు పిల్లలకు ముర్రు పాలు పట్టేందుకు అయిష్టత చూపుతున్నారు. దీంతో చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు. పౌష్టిహారలోపంతో ఇబ్బందిపడుతున్నారు. భవిష్యత్‌లో మరిన్ని వ్యాధులు సోకే ప్రమాదంలోకి నెట్టబడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఏటా తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తోంది. అమ్మపాల విశిష్టతపై మహిళలకు అవగాహన కల్పిస్తోంది.

- 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు
- బిడ్డకు పాలిస్తే అమ్మకు ఆరోగ్యం
- రోగనిరోధకశక్తి పెంపొంది శిశువులకు శ్రేయస్కరం



తల్లిపాల వారోత్సవం పోస్టర్

నగరి : నవజాత శిశువుకు బలం చేకూర్చే ఆహారం తల్లిపాలే అని నిపుణులు చెబుతున్నారు. నూరు శాతం పోషక విలువలున్న తల్లి పాలు శిశువు ఆరోగ్యంగా ఎదగడంలో, ఆయుష్షు పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వెల్లడిస్తున్నారు. అందుకే తల్లి పాల ఆవశ్యకతను వివరిస్తూ ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నారని వివరిస్తున్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీడీపీఓ కృష్ణవేణి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ఆవశ్యకతను సిబ్బంది వివరిస్తారని వెల్లడించారు.

ఆరు నెలల పాటు తల్లిపాలే ఆహారం

బిడ్డ పుట్టిన వెంటనే తప్పనిసరిగా ముర్రుపాలు పట్టించాలి. ఆరు నెలల పాటు తల్లిపాలను మాత్రమే ఆహారంగా ఇస్తే బిడ్డకు తేలికగా జీర్ణమవుతుంది. శ్వాసకోశ, అలర్జీ. ఆస్తమా, చర్మ వ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. రోజులో బిడ్డకు 8–10 సార్లు పాలు ఇవ్వాలి. ఆరు మాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి. కాన్పు అయిన మొదటి కొద్ది రోజులపాటు తల్లిపాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయి. వీటినే ముర్రు పాలు అంటారు. ఇందులో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిలో రోగాలను ఎదుర్కొనే శక్తిని పెంచే గుణం ఉంటుంది. అలాగే విటమిన్ ఏ,బీలతో పాటు తగినంత ఐరన్ కూడా ఉంటుంది. ముర్రుపాలతో శిశువులు చక్కగా పెరుగుతారు. కామెర్లు, విరేచనాల వంటి ప్రమాదకరమైన రోగాల నుంచి తల్లిపాలే కాపాడతాయి.

బాధ్యతగా భావించాలి

ముర్రుపాలు పట్టించడం భారం అనుకోకూడదు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలి. 6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలి. ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటివి. వారోత్సవాల్లో భాగంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. నగరి సీడీపీవో పరిధిలోని మొత్తం 202 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను పకడ్బందీగా చేపడతాం.
– కృష్ణవేణి, సీడీపీఓ, నగరి.



ప్రయోజనాలెన్నో..

- తల్లి పాలలో ప్రొటీన్లు లాక్టోఫెరిన్, కోలోస్ట్రమ్, కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక బ్యాక్టీరియా ఉంటాయి.
- తల్లిపాలు తాగే పిల్లలు ఎక్కువగా బలంగా ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. తెలివి తేటలు అధికంగా ఉంటాయి. డబ్బా పాలు తాగే పిల్లలకంటే చురుగ్గా ఉంటారు.
- బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెనవేసుకుంటుంది.
- తల్లిపాలు తేలికగా జీర్ణమవుతాయి. ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి.
- బిడ్డ దవడలు బాగా బలపడతాయి.
- పాలిచ్చే తల్లులకు నెలసరిలో రక్తస్రావం కూడా తక్కువగా ఉంటుంది. పాలిచ్చినంత కాలం మళ్లీ గర్భం రాకుండా గర్భనిరోధకంగా కూడా పనిచేస్తుంది.
- తల్లులకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు రావు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పాలసముద్రం: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ కోరారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురంలో గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుందని, ఆయా జ్వరాల లక్షణాలను, దాని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళి, సుశీల, ఏఎన్ఎం రేవతి, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

తైక్వాండోలో పుత్తూరు క్రీడాకారుల ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు

పుత్తూరు: తిరుపతిలోని సంస్కృతి వర్సిటీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 24వ ఉమ్మడి జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్‌లో పుత్తూరు క్రీడాకారులు బంగారు పతకాలతో మెరిశారు. బాలురు, బాలికల సబ్–జూనియర్, ఓపెన్ , జూనియర్, సీనియర్ విభాగాల్లో పట్టణానికి చెందిన గణేష్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులు ప్రతిభ చాటారు. కోచ్ గణేష్ మాట్లాడుతూ పుత్తూరు నుంచి మొత్తం 23 మంది క్రీడాకారులు పాల్గొనగా, ప్రతి ఒక్కరూ పతకం సాధించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో 170 మంది పాల్గొనగా పుత్తూరు క్రీడాకారులు 15 బంగారు, 5 రజత, 3 కాంస్య పతకాలు దక్కించుకున్నట్లు వివరించారు. ఆగస్టు 9 నుంచి 11వ తేదీ వరకు విజయనగరంలో జరిగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జూనియర్, సీనియర్ విభాగాల్లో 10 మంది క్రీడాకారులు అర్హత సాధించినట్లు వెల్లడించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను కోచ్‌లు శ్రీనివాసులు, లోకేష్ అభినందించారు.

రేషన్‌షాపు మార్పుతో కష్టాలు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గంటావారిపల్లె గ్రామస్తులు

వెదురుకుప్పం: 150కి పైగా రేషన్ కార్డులు ఉన్న తమ గ్రామంలోని రేషన్ షాపును కనీసం 20 కార్డులు కూడా లేని చోటికి మార్చడంతో చాలా ఇబ్బందులు పడుతున్నట్టు మండలంలోని గంటావారిపల్లె గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ షాపు మార్పుపై మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ, ఐదేళ్లుగా గంటావారిపల్లె పంచాయతీ కేంద్రం నుంచే బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారని, అయితే రేషన్ డీలర్ ప్రభుత్వం మారడంతో కార్డులు అధికంగా ఉన్నచోట నుంచి కాకుండా మునిరెడ్డిగారి ఊరికి తరలించి అక్కడి నుంచి రేషన్ పంపిణీకి ఏర్పాట్లు చేయడం తగదని నిరసించారు. మునిరెడ్డిగారిఊరులో కనీసం 20 కార్డులు కూడా లేవన్నారు. అక్కడికి వెళ్లి సరుకులు పొందాలంటే అర కిలో మీటరుకు పైగా నడచి వెళ్లాలన్నారు. అలాగే.. బొట్లవారిపల్లె, బొట్లవారిపల్లె ఆదిఆంధ్రవాడ వాసులకు సుమారు 2 నుంచి 3 కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి ఉంటుందన్నారు. అంత దూరం మహిళలు, వృద్ధులు నడచి వెళ్లలేక అవస్థలు పడాల్సి వస్తోందని, కార్డులు అధికంగా ఉన్న గంటావారిపల్లె నుంచే సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రేషన్ షాపు నిర్వహణకు సంబంధించి నివేదిక ఇవ్వాలని వీఆర్‌ఓ, ఆర్‌ఐలను ఆదేశించారు.

కలెక్టర్‌ను కలిసిన సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్

చిత్తూరు కలెక్టరేట్ : సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రసాద్ మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన పలు అంశాలపై ఆయన కలెక్టర్‌తో చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బ్యాంకు రుణాలను అర్హులకు విధిగా మంజూరు చేయాలని కలెక్టర్ చైర్మన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్ జీఎం ప్రభాకరన్, ఏజీఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రసాద్

'వేము'లో నూతన కోర్సులు

పూతలపట్టు: మండలంలో పి.కొత్తకోట సమీపంలోని వేము ఇంజినీరింగ్ కళాశాలలో కొత్తగా బీబీఏ,, బీసీఏ కోర్సులను ప్రారంభించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపల్ నవీన్ కిలారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోనే అటానమస్ ప్రోగ్రాం ద్వారా కోర్సులు ప్రారంభిస్తున్న ఏకైక కళాశాల తమదేనని, ఈ కోర్సులు ఉద్యోగ శిక్షణకు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అప్పిరెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని ఆళ్లమడుగులో ఇటీవల మృతి చెందిన సింగిల్‌విండో చైర్మన్ లోకనాథరెడ్డి తండ్రి అప్పిరెడ్డి చిత్రపటానికి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి నివాళులర్పించారు. మంగళవారం ఆయన లోకనాథరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలపై వాకబు చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, యువత మండల అధ్యక్షుడు గణపతిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ధనంజయరెడ్డి ఉన్నారు.


క్షయ నివారణకు టీకాలు తప్పనిసరి



మహిళకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: క్షయవ్యాధి నివారణకు బీసీజీ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ కోరారు. మంగళవారం మండలంలోని కట్టకిందపల్లెలో ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్లు వేశారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో క్షయవ్యాధి నివారణకు బీసీజీ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. గతంలో క్షయ మందులు వాడి మానేసిన వారికి కూడా టీకాలు వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దేశమ్మ ఆలయంలో పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నగరి : పట్టణ పరిధిలోని దేశమ్మ దేవాలయంలో మంగళవారం పెద్దసంఖ్యలో భక్తులు పొంగళ్లు పొంగించారు. నగరి పరిసర ప్రాంతాలతో పాటు తమిళనాడు సరిహద్దు గ్రామాలకు చెందిన భక్తులు వివిధ వాహనాల్లో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందున్న అమ్మవారి పాదుకల వద్ద పొంగళ్లు ఉంచి పూజలు చేశారు. అమ్మవారికి అంబలిని నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిపెట్టారు. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించుకున్నారు. అమ్మవారి తీర్థం కళ్లలో చల్లుకున్నారు. కొందరు తీర్థాన్ని బాటిళ్లతో పట్టుకెళ్లారు. ఆలయం వద్ద ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేతులమీదుగా అన్నదానం చేశారు.

కమనీయం.. తెప్పోత్సవం

కార్వేటినగరం: ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రెండవ రోజు మంగళవారం స్కంధ పుష్కరిణిలో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత అర్చకులు వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి పూజార్చన, అభిషేక కార్యక్రమాల అనంతరం వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంపై కొలువు దీర్చి పుష్కరిణి వరకు మంగళ వాయిద్యాల హోరు నడుమ తీసుకొచ్చారు.

సారె సమర్పణ

చాకలివానిగుంట ఎస్టీకాలనీకి వాసులు వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి పట్టువస్త్రాలు, పరిమళ భరిత పుష్పమాలికలను ప్రత్యేక వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం సారెతో ఉత్సమూర్తులను సుందరంగా అలంకరించి, స్కంధ పుష్కరిణిలోని తెప్పపై కొలువుదీర్చి, మంగళవాయిద్యాల నడుమ తెప్పోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. తెప్పోత్సవానికి మాజీ మంత్రి ఈవీ గోపాలరాజు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఈఓ క్రిష్ణనాయక్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రవియాదవ్, శేఖర్‌రాజు, చందురాజు, భక్తులు పాల్గొన్నారు.



సారె తీసుకొస్తున్న చాకలివాని గుంట ఎస్టీ కాలనీ వాసులు

తహసీల్దార్‌కు వీడ్కోలు సన్మానం



బదిలీపై సొంత జిల్లాకు వెళ్తున్న తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

పాలసముద్రం: బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ సుబ్బులక్ష్మమ్మకు మంగళవారం రెవెన్యూ ఉద్యోగులు వీడ్కోలు సన్మానం చేశారు. ఆమె ఎన్నికల విధుల్లో భాగంగా అనంతపురం జిల్లా నుంచి ఇక్కడికి వచ్చారు. తిరిగి సొంత జిల్లాకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె సేవలను ఉద్యోగులు ప్రస్తుతించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఆడి' పూజలు



అంబలి పోస్తున్న భక్తులు

పాలసముద్రం : ఆడి నెల పురస్కరించుకుని మంగళవారం మండలంలోని గంగమాంబపురం దళితవాడలో గ్రామస్తులు గ్రామ దేవతకు విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం మహిళలు ఊరేగింపుగా వెళ్లి అంబలి సమర్పించారు. అమ్మవారికి విశేషంగా అలంకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పొంగళ్ల పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించి, టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.

రుచికరంగా 'శుభ్‌దిన్ భోజన్'

నగరి : శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఏకాంబరకుప్పంలో శుభదిన్ భోజన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కేకే నమశ్శివాయం అనే దాత సహకారంతో విద్యార్థులకు రుచికరమైన విందు భోజనం వడ్డించారు. ఎంఈవోలు శ్రీదేవి, బి.నమశ్శివాయం, ఎమ్మార్సీ ప్రధానోపాధ్యాయులు వీఎస్ నమశ్శివాయం, పీఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. మండలంలోని మునెప్పనాయుడు క్రండిగ పాఠశాలలో నిర్వహించిన శుభదిన్ భోజన్ కార్యక్రమానికి గోవర్ధన్ నాయుడు దాతగా వ్యవహరించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అదనంగా స్వీట్లు, అరటిపండు, పెరుగు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నారాయణ స్వామి, పాఠశాల కమిటీ చైర్మన్ భువనేశ్వరి పాల్గొన్నారు.



ఏకాంబరకుప్పంలో భోజనం చేస్తున్న విద్యార్థులు



స్టీల్ ప్లేట్లు పంపిణీ చేస్తున్న రవిశేఖర్‌రెడ్డి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

విద్యార్థులకు స్టీల్‌ప్లేట్లు

పుత్తూరు: వడమాలపేట మండలం తడుకు ఆర్ఎస్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం.రవిశేఖర్‌రెడ్డి విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను వితరణగా మంగళవారం అందజేశారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు శుభదిన్ భోజనంలో అరటి పండు, స్వీట్లు పంపిణీ చేశారు. రవిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ఎం.కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం స్టీల్ ప్లేట్లు అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ జి.నరేంద్రవర్మ పాల్గొన్నారు.

శ్రీహరిపురంలో 'శుభదిన్' భోజనం

విజయపురం : మండలంలోని శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన శుభదిన్ కార్యక్రమం కింద విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించారు.



విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న చెంచురాజు

పాఠశాల పూర్వ విద్యార్థి, దాత చెంచురాజు ఈమేరకు ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంతో పాటు స్వీట్స్ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు జ్ఞానప్రసాద్ మాట్లాడుతూ చెంచురాజు గతంలో పాఠశాల అభివృద్ధికి చేయూత అందించారని, ఆయన సేవలు అభినందనీయమని ప్రశంసించారు. ఇకపై పుట్టిన రోజు, వివాహ వేడుకలు జరుపుకునే వారు శుభదిన్‌లో భాగంగా పాఠశాల ఆవరణలో పిల్లల మధ్య ఫంక్షన్ జరుపుకోవాలని కోరారు. దీంతో విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నరేష్, సురేష్, జయరామ్ పాల్గొన్నారు.